# పువ్వు నలిగిపోయింది

విచ్చిన ఎఱ్ఱ గులాబీ ఆనందంగా నవ్వుతోంది దేవకి మనసులా. నిన్నటివరకూ మొగ్గగా ఉన్న గులాబీ ఈ రోజే విచ్చుకుని, ప్రపంచాన్ని నేనూ చూస్తున్నాను అన్న సంబరంతో నవ్వుతూ మెల్లిగా గాలిలో ఊగుతోంది.

నిన్నటి వరకూ రాజు తన మనసులో మాట బయటికి చెప్పలేదు. ఈ రోజే తన తీయని కోరిక వెల్లడించాడు. ఆనందంతో తన అంగీకారం చెప్పింది కుసుమ. అందుకే సంబరంతో మనసు గాలిలో తేలిపోతోంది. తలుచుకోగానే సిగ్గుతో బుగ్గలు ఎఱ్ఱ గులాబీలయ్యాయి.

ఇంకా అత్తయ్యతో ఈ సంగతి చెప్పలేదు.

మెల్లిగా మల్లిచెట్ల దగ్గరకి నడిచింది.

మంచి మనిషి మనసులా స్వచ్ఛంగా మల్లెలు .... కీర్తిలాగా వాటి పరిమళం అంతటా వ్యాపిస్తోంది.

వెనకగా కనకాంబరాలు .... సువాసన లేకపోయినా అందంగా ఉంది మల్లెదండల్లో చేరిస్తే మల్లెలకి మరింత అందాన్ని పెంచుతాయి.

పక్కనే ఎఱ్ఱ గులాబీ మొక్కలు.

నిన్న రాజుతో జరిగి సంభాషణ గుర్తొచ్చి పెదవులమీద నవ్వు విరిసింది.

"ఇన్ని రకాల పూలున్నాయి కదా మీ తోటలో .... ఎర్ర గులాబీలంటేనే నీ కెందుకంత ప్రాణం ?"

సిగ్గుతో మౌనంగా తలొంచుకుంది తను.

"ఓ ! నాకు తెల్సిందిలే" అతనే అన్నాడు మళ్ళీ.

"ఏమిటి తెల్సింది ?" అడగకుండా ఉండలేకపోయింది తను.

"నీకూ, వాటికీ పోలిక ఉంది కనక...."

"అంటే ?"

"సిగ్గుపడినప్పుడు నీ చెంపల్లో ఎర్ర గులాబీలు పూస్తాయి. అందుకు." నవ్వాడు అందంగా, కొంటెగా.

"అమ్మగారు పిలుస్తున్నారండీ" నౌకరు పిలుపుతో ఉలిక్కిపడి చూసింది కుసుమ.

ఆలోచనల నంతటితో ఆపి అత్తయ్య గదిలోకి నడిచింది స్టూల్ మంచానికి దగ్గరగా లాక్కొని కూర్చుంటూ అడిగింది.

"ఏం కావా లత్తయా ?"

"బావ పొద్దున్న భోజనాని కొచ్చాడా ?"

"లేదత్తయ్యా ! పొద్దున్న కాఫీ, టిఫినూ తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఇంతవరకూ రాలేదు."

"ఊఁ ! ఎప్పుడూ ఉన్నదేగా .... ఇవాళ కొత్తేముందీ .... ఇష్టం ఉంటే వొస్తాడు .... లేకపోతే ఎక్కడెక్కడో తిరుగుతూనే ఉంటాడు ...."

నీరసంతో మెల్లిగా మాట్లాడుతున్న అత్తయ్యని చూస్తుంటే బాధని పించింది కుసుమకి.

"నీరసంగా ఉన్నప్పుడు మాట్లాడకత్తయ్యా. రెస్టు తీసుకో."

"ఇన్నాళ్ళనించీ రోజూ చేసేది అదేగా. మంచం దిగనీయకుండా ఉందీ రోగం. అయినా, అబ్బాయిని గురించిన బెంగ మనసుని తినే

స్తుంటే, ఏ మందులు మాత్రం నా రోగాన్ని తగ్గించగలవు? ఇంకొద్ది రోజుల్లో ఆ దేవుడు తప్పకుండా నాకు పూర్తి విశ్రాంతి ఇస్తాడు.''

"నువ్వలా మాట్లాడితే నే నిక్కడినించి వెళ్ళిపోతా నంతే.''

"పిచ్చితల్లీ .... ఎందుకలా భయపడి పోతావ్? ఉన్నమాటే అన్నాను.''

*　　　*　　　*

తల్లీ, తండ్రీ లేని కుసుమని ఎంతో ప్రేమగా, ఏలోటూ లేకుండా పెంచి పెద్ద చేశారు మామయ్యా, అత్తయ్యా.

వాళ్ళ మంచితనంవల్లే తను ఏ కష్టమూ లేకుండా మనగలుగు తోందని ఏనాడో గ్రహించుకుంది కుసుమ. కానీ అంత మంచివాళ్ళకి అటువంటి కొడుకు నెందు కిచ్చాడో భగవంతుడు .... అర్థం కాని సమస్యగా మిగిలిపోయింది.

బావని తల్చుకుని బాధ పడని రోజు లేదు .... బావకి లేని దురలవాటు లేదు .... ఇంట్లో అందరూ తన గురించి ఎంతగా కుమిలి పోతున్నారో కొంచెం కూడా అర్థం చేసుకోడు.

రాజు స్వభావం మూర్తి స్వభావానికి పూర్తిగా విరుద్ధం. మేడ మీద గదిలో అద్దెకుంటున్నాడు రాజు. మంచివాళ్ళల్లో ఒకడు. అతని మనసు దోచుకుంది కుసుమ. పెద్ద వాళ్ళతో చెప్పి వాళ్ళ ఆశీర్వాదం తోనే పెళ్ళి చేసుకోవాలన్న నిర్ణయం తీసుకున్నారు.

*　　　*　　　*

నౌకరు డాక్టరుకోసం పరిగెత్తాడు.

అత్తయ్యని చూస్తుంటే దుఃఖం ఆగట్లేదు కుసుమకి.

ఏడవద్దన్నట్టుగా సైగ చేస్తున్న మామయ్యని చూసి ఏడుపు ఆపు కోవడానికి అమిత ప్రయత్నం చేస్తూ నిలబడింది.

"చూడమ్మా కుసుమా! .... నేను .... నేను వెళ్ళిపోతున్నాను. ఈ ఇంట్లో ఆడ దిక్కు నువ్వే .... వాడి భారం నీదే ....''

"ఇప్పుడు నీకేమై పోయిందనీ ? .... డాక్టరు కోసం కబురు పంపించాను. వచ్చి ...."

భర్త మాట పూర్తి కాకుండానే అంది ఆవిడ "కాదు. నాకు తెల్సు. ఇంక ఏ మందులూ, ఏ డాక్టర్లూ నన్నాపలేరు. అయిపోయింది.... చివరి సారిగా నేను చెప్పదల్చుకున్నది చెప్పనివ్వండి .... చూడమ్మా కుసుమా ! బావని మంచి మనిషిగా నువ్వే చెయ్యాలి. వాడింకెవరినైనా పెళ్ళి చేసుకుంటే ఆ వొచ్చే ఆడది వాడిని దార్లోకి తీసుకు రాగలదని నాకు నమ్మకం లేదు..... ఈ ఇంటి సంగతీ, బావ పద్ధతీ బాగా తెల్సిన దానివి నువ్వు .... నీ మీద నాకు నమ్మకం ఉంది .... నువ్వే వాడి భార్యవై వాడిని మంచి మనిషిగా చెయ్యాలి. అలాగేనని నువ్వు మాట ఇస్తే నా కంతే చాలు.... తృప్తిగా కళ్ళు మూస్తాను...."

అదిరిపడింది కుసుమ మనసు.

బావని చేసుకోవాలా తను ?....

అయ్యో ! రాజు సంగతి నాలుగు రోజుల క్రిందటే అత్తయ్యతో చెప్పి ఉంటే ఎంత బాగుండేది. .... సంతోషంతో దీవించేది కాదూ ? .... కానీ .... కానీ ఇప్పుడెలా ?

చిన్నప్పటి నించీ ప్రేమతో పెంచి పెద్దచేసిన అత్తయ్య ఋణం తను ఎలాగూ తీర్చుకోలేదు .... కనీసం చివరిసారిగా కోరిన కోరికైనా నెరవేర్చకపోతే ఇంక తన బ్రతుకెందుకు ? అత్తయ్య కోరిక తీర్చలేక పోయానే అని జీవితాంతం బాధ పడుతూ జీవచ్ఛవంలా బ్రతక వలసి వస్తుంది. .... మరి రాజు .... నిన్న పెళ్ళి చేసుకుంటానన్న రాజుకి నవ్వుతూ తన అంగీకారం తెలిపిందే ? .... ఇంతలోనే అతన్ని కాదని బావని చేసుకుంటే అంతకంటే అన్యాయం ఉంటుందా ? ....భగవాన్ ! మనసులు కలిసిన రాజుని కాదని బావని చేసుకోవాలా తను ? కానీ.... అత్తయ్య కోరికని తోసి పుచ్చే శక్తి తన దగ్గర లేదు. మొదటిసారి గానూ, చివరిసారిగానూ కూడా అత్తయ్య తనని కోరుకున్న ఒకే ఒక

కోరిక ఇది. మృత్యువు చాపినా కబంధ హస్తాల్లో చిక్కుకు పోతూ దయ నీయంగా అడుగుతోంది అత్తయ్య.... కాదనలేని స్థితిలో కొట్టు మిట్టాడు తోంది మనసు ....

ఆయాసంతో రొప్పుతూ చెయ్యి చాపిన అత్తయ్య వైపు ఒక్క క్షణం చూసి, గుండె రాయి చేసుకుని ఆ చేతిలో తన చేతినుంచి "బావని నేను చేసుకుంటా నత్తయ్యా! మంచి మనిషిగా మార్చడానికి నా శాయ శక్తులా ప్రయత్నిస్తాను...." అంది.

కుసుమ నోటినించి వచ్చే ఆ మాట కోసం ఎదురు చూస్తున్న ప్రాణి తృప్తిగా నవ్వుతూ అలాగే ఉండిపోయింది కదలిక లేక.

డాక్టరి అవసరం లేకపోయింది.

* * *

"నేను వెళ్ళిపోతున్నానని చెప్పడానికి వచ్చాను. ఈ ఇంట్లోంచే కాదు. ఈ ఊర్నించే వెళ్ళిపోతున్నాను. నే నంటే ఇష్టమున్నట్టు నటించి, నన్ను పెళ్ళి చేసుకోవడం నీ అదృష్టంగా భావిస్తున్నట్టు తీయని కబుర్లు చెప్పి .... చివరికిప్పుడు మీ బావని చేసుకోబోతున్నావు .... ఎందుకో నేను ఊహించుకో గలను .... మీ బావ ధనవంతుడు. అతని కున్న ఆస్తిపాస్తులు నాకు లేవు. నాకు ఉద్యోగం తప్ప మరేమీ లేదు. అటువంటి నన్ను పెళ్ళి చేసుకుంటానంటే నమ్మడం నాదే పొరపాటు. కానీ, నమ్మించి మరో వ్యక్తిని బాధ పెట్టాల్సిన అవసరం నీ కెందుకు కలిగిందో అర్థం కావట్లేదు .... వెళుతున్నాను.... నువ్వయినా హాయిగా, సుఖంగా ఉండు.... మళ్ళీ ఈ జన్మలో ఇంక నా మొహం చూపించి నిన్ను బాధ పెట్టనులే" ఎంత విసురుగా వచ్చాడో అంత విసురుగానూ బయటికి వెళ్ళిపోయాడు రాజు.

ఎన్నో చెప్పాలనుకుంది కుసుమ.

ఎన్నో మాట్లాడాలనుకుంది.

కానీ ఒక్క మాటా బయటికి రాలేదు.

"నేను చెప్పేది కొంచెం విను రాజూ" బలవంతాన గొంతు పెగుల్చుకుని అన్న ఆ ఒక్క మాటకూడా వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు రాజు.... పిలుపు వినబడని దూరం వెళ్ళిపోయా డప్పుడే....

అతనన్న ఒక్కొక్క మాటా గుండెలో శూలమై గుచ్చుతోంది. ఆ బాధతో గుండె ఆగిపోతే బాగుండు ననుకుంది.....

కానీ అంత అదృష్టం తన కెక్కడిది....

* * *

"కుసుమా...."

ఉలిక్కిపడి చూసింది.

లోపలికి వచ్చాడు మూర్తి.

"ఏమిటి బావా?"

నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను...."

ఏమిటన్నట్టుగా చూసింది అతని వైపు.

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకుందుకు ఎందుకొప్పుకున్నావో నాకు తెలియంది కాదు.... డబ్బుకోసం...."

"బావా!" అభిమానం దెబ్బ తిని ఆర్తనాదం చేసింది.

"లేకపోతే, నే నెలాంటివాడినో, నా కెన్ని దురలవాట్లున్నాయో తెలిసికూడా నువ్వు మనస్ఫూర్తిగా నన్ను చేసుకునేందు కొప్పుకున్నావంటే నేను నమ్మను. ధనవంతుడైన భర్త వస్తుంటే ఏ ఆడది వొద్దంటుంది?"

"బావా!" రెండు చేతుల్లోనూ మొహం దాచుకుంది కుసుమ. "ఈ నిందలూ, ఈ బాధా భరించడం కంటే చావడం మేలు."

"ఇంతకీ నేను చెప్పదల్చు కున్నదేమిటంటే, నేను పెళ్లి చేసుకోబోతున్నది నిన్నే .... కానీ నేను ప్రేమించింది నా స్నేహితురాలు సరళని. సరళది మన కులం కాదు. అందుచేత సరళని చేసుకుంటానంటే నాన్నగారు ఒప్పుకోరు. ఆస్తి ఇవ్వను పొమ్మంటారు, మనిద్దరికీ కావ

ల్సింది డబ్బు.... నేను నిన్ను పెళ్ళిచేసుకోడంవల్ల మనిద్దరం కూడా ఈ ఆస్తి అనుభవించచ్చు....''

— మూగపోయింది కుసుమ కోమల హృదయం.

చైతన్యం లేక బొమ్మలా నిలబడిపోయి వింటోంది.

"నాకు కావల్సింది నీ లాంటి భార్యే.... పేరుకి నువ్వు భార్యవి. కానీ, నిజానికి సరళే నా భార్య .... నేనేం చేసినా, ఎక్కడ తిరిగినా, ఎదురుచెప్పకుండా చెప్పినట్టు ఇంట్లో పడి ఉంటావు నువ్వు. అందుకే నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను.... నిజానికి సరళే నా భార్య. ఈ విజం నీతో ముందే ఎందుకు చెప్తున్నానంటే, తెల్సుకుని నా క్కావల్సినట్టు మసులు కుంటావని....''

"నువ్వే వాడి భార్యవైతే వాడిని మంచి మనిషిగా చెయ్యగలవు. ఆ నమ్మకం నాకుంది.'' అత్తయ్య మాటలు చెవుల్లో మారు మోగాయి. ఇప్పుడు ఈ పరిస్థితిలో ఏం చెప్పినా నమ్మడు బావ. మెల్లిగా తనంతట తనే తెల్సుకోవాలి తప్ప....

స్నేహితుడు కాబోలు వీధిలోంచి పిలిచాడు మూర్తిని.

వెళ్ళిపోయాడు మూర్తి బయటకి.

కలో, నిజమో అర్థం కాక సతమతమౌతోంది కుసుమ మనసు. నిజమని తెల్సి, భరించలేని నిజంతో మండిపోతోంది హృదయం. బాధతో కుమిలిపోడం తప్ప మరేమీ చెయ్యలేక మూగపోయింది. ఇప్పుడు కాకపోయినా ఎప్పటికైనా బావని తన వాణ్ణిగా చేసుకోగలదా ? అత్తయ్య కోరిక నెరవేర్చ గలదా ?

బావని దురలవాట్లనించి తప్పించి మంచి మనిషిగా తీర్చి దిద్ద గలదా ?

తన బ్రతుకు పూలబాట చేసుకోగలదా ?

ఆవేదనతో, దుఃఖభారంతో మంచంమ్మీద వాలిపోయింది కుసుమ.

జడలోని ఎఱ్ఱ గులాబీ పువ్వు నలిగిపోయింది.

★